దళిత అధ్యయన కేంద్రం భవనానికి

తుది మెరుగులు

● త్వరలో ప్రారంభం


లైబ్రరీ హాల్

బోరబండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో దళిత అధ్యయన కేంద్రం భవన నిర్మాణం తుది మెరుగులు దిద్దుకుంటోంది. దళిత వర్గాలకు చెందిన వారికి ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ ఇవ్వడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పించడం, ఆ వర్గాలకు ప్రయోజనం చేకూర్చే సమావేశాలు, సదస్సుల నిర్వహణతోపాటు దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత మ్యూజియంను ఇక్కడ అందుబాటులోకి తేనున్నారు. దాదాపు 9ఏళ్ల క్రితం మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భూమి పూజ చేసిన ఈ భవనాన్ని రూ.23 కోట్ల అంచనా వ్యయంతో 9 అంతస్తుల్లో నిర్మించారు.

27 అడుగుల అంబేడ్కర్ విగ్రహం

ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 క్వారీ స్థలంలో నిర్మించిన దళిత అధ్యయన కేంద్రం భవనం ముందు భాగంలో 27 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పుణేకు చెందిన జాతీయ అవార్డు గ్రహీత మూర్తి ప్రత్యేక శ్రద్ధతో విగ్రహాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నెక్లెస్ రోడ్డులో రాష్ట్ర సచివాలయం వద్ద ఉన్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఇదే కావడం విశేషం. అడుగడుగునా బౌద్ధ ముద్రలు, స్థూపాలు, చిహ్నాలతో నిర్మించిన ఈ భవనానికి ముందు ప్రత్యేక ఆకర్షణగా బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

10 వేల పుస్తకాల గ్రంథాలయం

విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా అధ్యయన కేంద్రంలో పదివేల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పలువురు సీనియర్ పాత్రికేయులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారుల వ్యక్తిగత గ్రంథాలయాల నుంచి వివిధ భాషలు, అంశాలతో ఉన్న వేల గ్రంథాలను ఇక్కడకు చేర్చారు. అంతేగాకుండా 10 లక్షల పుస్తకాలను డిజిటలీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధ్యయన కేంద్రం ఛైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య వెల్లడించారు.

విద్యా విశేషాల వేదిక

అధ్యయన కేంద్రంలో దళిత విద్యార్థులు చదువుకునేందుకు, విదేశీ అతిథుల ఉపన్యాసాలకు వేదికగా ఈ కేంద్రం రూపుదిద్దుకుంది. ఇక్కడకు వచ్చే వారికి భోజనం వసతి కల్పిస్తారు. ప్రాంగణంలో 300 మందికి సరిపడా ఆడిటోరియం, సమావేశ మందిరం ఇతర ఏర్పాట్లు ఉంటాయి. విద్యార్థులు వివిధ అంశాలపై ఇక్కడ అధ్యయనం చేసే అవకాశం ఉంది. కాఫీ బార్, వేచి ఉండే ప్రాంగణం, ధ్యానగది, దళిత మ్యూజియం అందుబాటులోకి తేనున్నారు. దేశంలో ఎక్కడా దళిత మ్యూజియం లేదని ప్రత్యేకంగా అధ్యయన కేంద్రంలో దానిని ఏర్పాటు చేస్తామని లక్ష్మయ్య చెప్పారు. రానున్న రోజుల్లో ఈ కేంద్రం పలు పరిశోధనలకు వేదికగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం దళిత వర్గాల వారికే కాకుండా, ఇతర సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు శిక్షణ, అధ్యయానికి నిలయంగా ఈ కేంద్రం ఉంటుందని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగానీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కగానీ అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. అధ్యయన కేంద్రం పై భాగంలో బౌద్ధ స్థూపాన్ని ఏర్పాటు చేశారు. బుద్ధుడి కాలంలోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందని, రాజు, ప్రజల కర్తవ్యం బాధ్యతలను వివరించే ఫలకాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు ఇటువంటి స్థూపాలను ఏర్పాటు చేయనున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.


అశోక చక్ర స్థూపం


ఎస్పీఆర్ హిల్స్‌లోని దళిత అధ్యయన కేంద్రం

నాడు క్వారీ గుంత.. నేడు ఎత్తయిన వింత

కొన్ని దశాబ్దాల కిందట జన సామర్థ్యం అంతగా లేని రోజుల్లో ఇందిరానగర్ ప్రాంతంలోని పెద్ద, పెద్ద కొండలను బర్మాలు, డిటోనేటర్లు పెట్టి పేల్చి బండలుగా మారుస్తూ అనేకమంది ఉపాధి పొందేవారు. కాలానుగుణంగా పరిసర ప్రాంతాల్లో జనాభా భారీగా పెరగడం, కొండ కాస్త లోయగా మారడంతో రాళ్లు కొట్టే పని నిలిచిపోయింది. రాజకీయ ప్రాబల్యం కలిగిన కొందరు స్థానిక నాయకులు ఈ స్థలాన్ని మట్టితో నింపి ప్లాట్లుగా విభజించి అమ్మేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. దళితులకు అన్ని రకాలుగా ఉపయోగపడే ఏర్పాట్లు కల్పించేందుకు వివాద రహితంగానూ, విశాలంగానూ ఉన్న అవసరమైన స్థలం నగరంలో ఎక్కడా లభించలేదు. చివరకు దళిత అధ్యయన కేంద్రం ఛైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య ఈ స్థలాన్ని ఎంపిక చేసి ఇక్కడ భవన నిర్మాణాన్ని చేపట్టాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. ఎట్టకేలకు అధికారులు ఈ స్థలాన్ని అధ్యయన కేంద్రం నిర్మాణానికి కేటాయించారు. మొత్తం 72 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దళిత అధ్యయన కేంద్రం నిర్మితమైంది.


స్వామివారికి పూజలు చేసిన అర్చకులు, భక్తులు

15,116 వడలతో ఆంజనేయస్వామికి అలంకరణ

బంజారాహిల్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెం.14లోని నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమితో పాటు ఉత్తరా నక్షత్రం పంచమి తిథి సందర్భంగా స్వామివారికి 15,116 వడలతో వడ మాలలు వేశారు. ఆలయ అర్చకులు శశికుమారాచార్యులు మాట్లాడుతూ శ్రావణ మాసం అంటే స్వామివారికి ఎంతో ప్రీతికరమైనదని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, ఆలయ ఛైర్మన్ దశరథ చౌహాన్, రత్నాకర్, ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.


నాగుల పంచమి సందర్భంగా ఎన్‌బీటీ నగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో నాగదేవతలకు పూజాధికాలు నిర్వహిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

ఉద్రిక్తతలు వద్దు.. నిందితులను వదిలేది లేదు

● ఏసీపీ సంజయ్‌కుమార్


ఖైరతాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

ఖైరతాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓ రౌడీ ముఠా దుశ్చర్యతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయమై ఖైరతాబాద్‌లో ఇప్పటికీ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్ మంగళవారం స్థానిక నాయకులతో పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. నిందితులపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం వల్లే వారి విషయం తమకు తెలియదని, ఈ కేసులో నిందితులను గుర్తించామని, అందరిపైన కఠిన చర్యలు తప్పవని హామీ ఇచ్చారు. ఏ సంఘటన జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీని స్థానికులు పలు విషయాలపై నిలదీశారు. నిందితులు పోలీస్‌స్టేషన్లలో మకాం వేసి ఇక్కడే సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, వారికి పోలీసులు వంత పాడుతూ కేసులు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో ఎలాంటి నిజం లేదని, పోలీసులు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటే సరేనని, లేకుంటే తామే వారికి సరైన రీతిలో సమాధానం చెప్తామని స్థానికులు తెలిపారు. అనంతరం ఖైరతాబాద్‌లో యువకుడు ముఖేష్ మృతికి సంతాపం తెలుపుతూ ఖైరతాబాద్ భారీ గణపతి ప్రాంగణం నుంచి మార్కెట్ చౌరస్తా, లక్ష్మీనగర్, జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ నుంచి తిరిగి గణేశ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ సంజయ్‌కుమార్, సీఐ రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్, బాక్సర్ అశోక్, మహేందర్ బాబు, చందు గంగపుత్ర, మహేష్‌యాదవ్, రాజు, ధర్మేష్‌ము దిరాజ్, మధుకర్ యాదవ్, సురేందర్, రాజ్‌కుమార్, రాజేందర్ యాదవ్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

బ్యానర్లు నిషేధం..

ఖైరతాబాద్‌లో ఇక నుంచి బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టడాన్ని నిషేధించారు. ఒక బ్యానర్ విషయమై జరిగిన గొడవ నేపథ్యంలో ఓ యువకుడు మృతి చెందగా ఈ విషయమై స్థానికులు, పోలీసులకు మధ్య జరిగిన సమావేశంలో ఏసీపీతో స్థానికులు ఒప్పందానికి వచ్చారు. ఖైరతాబాద్ గణపతితో పాటు ఎప్పటికీ బ్యానర్లు కట్టమని స్థానిక నాయకులు హామీనిచ్చారు. ఈ నిర్ణయంపై పోలీసులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఖైరతాబాద్ బంద్

బయటి వ్యక్తులు ఖైరతాబాద్‌కు వచ్చి స్థానికులపై దాడులకు పాల్పడడంతో స్థానిక యువకుడు మృతి చెందినందుకు నేడు ఖైరతాబాద్ బంద్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. స్వచ్ఛందంగా ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బంద్ పాటించాలని నిర్ణయించారు.

ఇద్దరికి రిమాండ్

ఖైరతాబాద్ గజ్జెలమ్మ ఆలయం సమీపంలో బ్యానర్ విషయమై ముఖేష్, సునీల్ మధ్య జరిగిన గొడవలో ఆదివారం రాత్రి ఓ రౌడీమూక ముఖేష్‌పై భౌతికదాడి చేయడంతో పాటు చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో ముఖేష్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనలో యావత్ ఖైరతాబాద్ ఒక్కటై ఆ రౌడీమూకకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ కేసులో బేగంపేటకు చెందిన నాగిశెట్టి వికేష్(37), ఖైరతాబాద్ గాంధీనగర్‌కు చెందిన రాజ్‌ధర్ కటియా ధరమ్‌రాజ్ అలియాస్ ఫాతు (37)ను సంగారెడ్డిలో అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నామని సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.


జవహర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్
- వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి


మాట్లాడుతున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖైరతాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హరియానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ పార్కింగ్ యార్డులోని ఆలయం వద్ద బోనాల వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన దత్తాత్రేయ అనంతరం జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ప్రతినిధులు కె.బాలరాజు, జగదీష్, ఆర్.కృష్ణ, జోనల్ అధ్యక్షురాలు కె.రేణుక పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు చేయూత

ఎర్రగడ్డ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనాథ విద్యార్థులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి అన్నారు. మంగళవారం ఆయన సోదరుడు బొప్పన ధీరజ్ చౌదరి జయంతిని పురస్కరించుకొని ఎర్రగడ్డలోని జీవోదయ హోమ్ ఫర్ చిల్డ్రన్స్ అనాథాశ్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రెయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనాథాశ్రమం నిర్వాహకురాలు నిర్మల, స్థానిక నాయకులు, ధీరజ్ చౌదరి స్నేహితులు విష్ణు, వంశీ, విజయ్, స్వామి, వంశీగౌడ్ పాల్గొన్నారు.

డిజైనర్‌తో సహజీవనం.. పెళ్లికి నిరాకరణ

● పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

బంజారాహిల్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవాలని అడిగినందుకు డిజైనర్‌పై ఓ వైద్యుడు దాడి చేశాడు. బాచుపల్లి కి చెందిన డాక్టర్ రాజేందర్‌రెడ్డి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్‌గా పనిచేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఓ యువతితో వివాహం జరిగింది. ఇదిలా ఉండగా, మణికొండకు చెందిన డిజైనర్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన రాజేందర్‌రెడ్డి 14 నెలలుగా ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. కాగా, రాజేందర్‌రెడ్డికి వివాహమైనట్టు తెలుసుకున్న డిజైనర్ తనను కూడా పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి తేవడం మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఈనెల 28న ఫిలింనగర్‌లో రాజేందర్‌రెడ్డి పనిచేస్తున్న ఆస్పత్రికి వచ్చింది. పెళ్లి చేసుకోవాలని నిలదీయడంతో ఆమెను కొట్టడంతోపాటు బయటకు నెట్టేసి మొబైల్ ఫోన్‌ని పగలగొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు రాజేందర్‌రెడ్డిపై బీఎంఎస్ 79, 127(2), 115(2), 324(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణి మంగళసూత్రం మాయం

బంజారాహిల్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరిన మహిళ మెడలోని మంగళసూత్రం కనిపించకుండా పోయింది. కర్మన్‌ఘాట్‌కు చెందిన జంపాల పావని గర్భిణి. ఈనెల 23న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని టీఎక్స్ ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. రెండు రోజులపాటు ఐసీయులో ఉంచిన వైద్యులు ఆమెను పరీక్షల నిమిత్తం మరో వార్డుకు తరలించారు. అప్పటి వరకు ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు కనిపించకుండా పోయింది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు కృషి

● ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్


ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎం గీత

బోరబండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. మెరుగైన వసతులు కల్పించడం ద్వారా కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని చెప్పారు. బోరబండ బలహీనవర్గాల కాలనీలోని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, నాంపల్లి)లో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అటల్ థింకరింగ్ ల్యాబ్‌ను తన సతీమణి నాగమణితో కలిసి మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన, ఆధునిక కాలంలో వినియోగించే డ్రోన్లు ఇతర పరికరాలు ఈ ల్యాబ్‌లో ఉన్నాయని తెలిపారు. పాఠశాల విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిరాలు గీత కల్వారి మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం కింద నగరంలో ఎంపికైన మూడు స్కూళ్లలో తమది ఒకటని వెల్లడించారు. 40శాతం రాష్ట్ర నిధులు, 60 శాతం కేంద్ర నిధులతో సమష్టిగా విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. తమ పాఠశాలలో టీచర్ గా పనిచేసిన నాగమణి ఇక్కడ జరిగిన ల్యాబ్ ప్రారంభోత్సవానికి అతిథిగా హాజరవడం హర్షణీయమని అన్నారు. హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్, ఖైరతాబాద్ మండల ఉప విద్యాధికారి శామ్యూల్ రాజ్, నాట్కో హైస్కూల్ ఇన్‌చార్జి ప్రేమవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల బోధన సిబ్బంది పెంపుతో పాటు భద్రత ఏర్పాట్లు కల్పించాలని కోరుతూ హెచ్‌ఎం గీత ఎమ్మెల్సీ దయాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు యశష్, మణికంఠ, శివచరణ్

పులుల దినోత్సవం పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫౌండేషన్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో యూసుఫ్‌గూడ మారుతీనగర్ ఎంజీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సీబీఎస్‌ఈ ఆరో తరగతికి చెందిన యశష్, మణికంఠ క్విజ్ జూనియర్స్ విభాగం పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. క్రియేటివ్ రైటింగ్ (సీనియర్స్)లో తొమ్మిదో తరగతి విద్యార్థి శివచరణ్ (ఎస్‌ఎస్‌సీ) ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు. విజేతలకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ డైరెక్టర్ అక్బర్ బహుమతులను ప్రదానం చేశారు.

డిసెంబరు 13న సెయింట్ థెరిస్సా పాఠశాల పూర్వ విద్యార్థుల 3వ గ్రాండ్ అలుమ్ని వేడుకలు

● సెప్టెంబరు 30లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

పంజాగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 1968 నుంచి 2025 మధ్య చదువుకున్న విద్యార్థులతో డిసెంబరు 13న పాఠశాల ఆవరణలో మూడవ గ్రాండ్ అలుమ్ని వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కె.ధనశేఖర్‌రెడ్డి, కోశాధికారి సి.శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యక్షులు కంజర్ల సదాశివ యాదవ్, కె.చక్రపాణి, ఎం.విజయలక్ష్మితో కలిసి పాఠశాలలో చదివిన విద్యార్థుల పేర్ల నమోదు కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్, వెబ్‌సైట్ వివరాలను ఆవిష్కరించారు.

పూర్వ విద్యార్థులు సెప్టెంబరు 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, రఫత్ సుల్తానా, లిజి, ఎన్.స్వప్న, జి.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న కమాండెంట్, పోలీస్ ఉన్నతాధికారులు

బెటాలియన్‌లో వనమహోత్సవం

యూసుఫ్‌గూడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని మొదటి పటాలము కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ప్రథమ పటాలములో వన మహోత్సవం నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పండ్లు, పూలు, ఔషధ మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడాలని మురళీకృష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ కె.వి.వి.ప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిని తెరిపించాలని తహసీల్దార్‌కు వినతి

హైటెక్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రహదారిని తెరిపించాలని కోరుతూ బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాదాపూర్ డివిజన్ శేరిలింగంపల్లి మండల పరిధిలోని గుట్టలబేగంపేట సర్వేనెంబర్. 17/2లో 30 ఏళ్లుగా నడక దారి ఉంది. ఇటీవల ఓ బిల్డర్ ఆ రహదారిని మూసి చుట్టూ రేకులతో కాంపౌండ్ ఏర్పాటు చేశారు. దీంతో బోరబండ ప్రాంతం నుంచి మాదాపూర్ నడిచి వెళ్లే వారంతా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో సర్వే చేయించి రహదారిని తెరిచేలా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కుమ్మరి సతీష్, పార్టీ నాయకుడు వినోద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ ఆంజనేయులు

ఓటర్ల జాబితా రూపకల్పనకు నాయకులు సహకరించాలి

సికింద్రాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అత్యంత పకడ్బందీగా రూపొందిస్తున్న కొత్త ఓటర్ల జాబితా కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమవంతు సహకారం అందించాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ ఉప కమిషనర్, సికింద్రాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆంజనేయులు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పోలింగ్ బూత్‌లో 1200 మంది ఓటర్లు మాత్రమే ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బీఎల్ఓలు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. ఓటర్ల పేరు, చిరునామా వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సికింద్రాబాద్, మారేడుపల్లి, తహసీల్దార్లు భూమయ్య, పాండునాయక్, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానర్ పావని, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణి, ఎన్నికల విభాగం అధికారి పవన్, వివిధ పార్టీల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యపై తుకారాంగేట్‌లో పర్యటించిన మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ నర్సింహ, బీజేపీ నేతలు

ట్రాఫిక్‌ను మళ్లించాలని వినతి

అడ్డగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రద్దీగా ఉండే ప్రాంతమైన తుకారాంగేట్ ఆర్‌యూబీ బ్రిడ్జి సమీపంలో భారీ వాహనాలను లాలాగూడ రైల్వేస్టేషన్ మీదుగా మరలించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు మంగళవారం మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ నర్సింహను వినతిపత్రం అందజేయగా, ఘటన స్థలానికి సీఐ చేరుకుని ఇక్కడ ఉన్న ట్రాఫిక్ పరిస్థితిని తెలుసుకున్నారు. హనుమాన్‌పేట్, గౌతమ్‌నగర్, మల్లికార్జున్‌నగర్ మీదుగా వచ్చే కార్లు, ఆటోలను న్యూ మిర్జాలగూడ, లాలాగూడ రైల్వేస్టేషన్ మీదుగా ట్రాఫిక్‌ను మరలించాలని సీఐకి సూచించడంతో సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా జ్యోతినగర్‌లో ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి లాలాగూడ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ నాయకులు సత్యనారాయణ, సంజు కుమార్‌లతో పాటు బస్తీవాసులు కోరారు.



దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు

దోమల నివారణపై అవగాహన

అడ్డగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బస్తీలో దోమల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు సూచించారు. మాన్‌సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విపరీతమైన దోమలు వ్యాపిస్తుంటాయని ఇంటి పరిసరాల్లో, ఇంటిపైన వర్షపునీరు నిలిచే పనికి రాని వస్తువులను తొలగించాలని అన్నారు. వాడిన కొబ్బరిబోండాలు, ప్లాస్టిక్ వస్తువులు, పగిలిన మట్టి కుండలు ఇలా పనికి రానీ వస్తువులు ఇంటిలో ఉంచకకూడదన్నారు. వీటివల్ల దోమలు వ్యాపించి డెంగ్యూ వ్యాధిన పడతారన్నారు. ఎంటమాలజీ విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు బస్తీలో పర్యటిస్తారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ రిసోర్స్ పర్సన్, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్లు, సిబ్బంది, జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్ఐఈపీఐడీ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయినపల్లి ఎన్ఐఈపీఐడీలో మొక్కలు నాటిన భట్టి విక్రమార్క

బోయినపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా బోయినపల్లిలోని ఎన్ఐఈపీఐడీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసేబిలిటీస్) ప్రాంగణంలో ఇస్మాయిలీ సివిక్, ఆగాఖాన్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గౌరవ అతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పర్యావరణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈ స్వచ్ఛంద సంస్థ చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిలీ సివిక్, ఆగాఖాన్ సోషల్ వెల్ఫేర్ బోర్డు అమీన్ లధ, అంజుం కేతనిలతో పాటు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయినపల్లి మార్కెట్ యార్డ్ పాలకమండలి సభ్యుడు శరత్, స్థానిక నాయకులు బద్దం బలవంత్ రెడ్డి, సదా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



వెంకటలక్ష్మి

రాంగోపాల్ పేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రురాలై గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేసే వెంకటలక్ష్మి(38) భర్త కనకరాజుతో కలిసి 21న వారి స్వస్థలం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాగ్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ ప్యారడైజ్ మీదుగా వెళుతుండగా ఆమెకు కళ్లు తిరిగి ద్విచక్రవాహనం నుంచి వెనుకకు పడిపోయింది. దీనితో ఆమె తలకు తీవ్రగాయాలు కాగా సమాచారం అందుకున్న రాంగోపాల్‌పేట్ పోలీసులు రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసుకుని, ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె సోమవారం మృతి చెందిందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. దీనితో ఆమె కుటుంబ సభ్యుల గురించి వాకబు చేయగా అక్కడ ఎవరూ లేరని తెలిసింది. ఆమె భర్త కనకరాజు ఫోన్‌కు కాల్ చేయగా అది స్విచ్ఆఫ్ వస్తుంది. మృతిరాలిని ఎవరైనా గుర్తుపడితే రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



క్లాక్‌టవర్ నాగదేవత ఆలయంలో పూజలు చేసిన సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ



చింతబావి పుట్ట వద్ద భక్తులు



బోయినపల్లి బాపూజీనగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలోని నాగ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



నామాలగుండు రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పుట్టలో పాలు పోయటానికి క్యూలో మహిళలు



ఎల్.నారాయణనగర్‌లో నాగపంచమి వేడుకల్లో పాల్గొన్న బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ



అన్నదాన కార్యక్రమంలో మేకల సారంగపాణి



సీతాఫలమండి మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తిరుమలగిరి జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగ పంచమి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం లాల్‌బజార్‌లోని నాగదేవత ఆలయంలో పూజలు జరిగాయి. నిర్వాహకులు అమ్మవారిని వివిధ రకాల పూల మాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్, తిరుమలగిరి, లాల్‌బజార్, అల్వాల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి నాగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. పుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ నాగ దేవతను దర్శించుకొని పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత నాగదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీ ముదిరాజ్, తేజ్‌పాల్ లు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ఆలయాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సీతాఫల్‌మండి మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయం, నామాలగుండులోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పుట్ట వద్ద పూజలు చేసి పాలు పోశారు. ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు పూజలు చేశారు. బౌద్ధనగర్ ఎల్.నారాయణ నగర్‌లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ పాల్గొని పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ క్లాక్‌టవర్ నాగదేవత ఆలయంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ప్రత్యేక పూజలు చేశారు.

చిలకలగూడలో

నాగ పంచమి సందర్భంగా మంగళవారం మెట్టుగూడలోని పలు ప్రాంతాల్లో మహిళలు పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. చింతబావిలో పుట్ట వద్దకు భారీగా భక్తులు తరలి వచ్చి నాగదేవతకు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొట్టి కుమార్, ప్రతాప్ కుమార్, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో

బోయినపల్లిలో మంగళవారం ప్రజలు నాగపంచమిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా మల్లారెడ్డి గార్డెన్, నల్ల పోచమ్మ ఆలయం తోకట్ట ప్రాంతాల్లోని ప్రజలు పుట్టల్లో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు తెల్లవారుజాము నుంచే బోయినపల్లిలోని ఆలయాల్లో నాగదేవత అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు చేసి భక్తిని చాటుకున్నారు.

కంటోన్మెంట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా





బోయినపల్లిలోని పలు కాలనీల్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

● ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయినపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో పని చేస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బోయినపల్లి పరిధిలోని పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ, నాలా వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో ఎన్నో సంవత్సరాలుగా స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల రూ. 303 కోట్లు కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి మంజూరు కావడం జరిగింది. ఈ నేపథ్యంలో తమ కాలనీలను అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళవారం బోయినపల్లిలోని మర్రిరామ్‌రెడ్డి భారతి ఎమెన్యూ కమ్యూనిటీ హాల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సూచన మేరకు మాల్యాద్రి ఆధ్వర్యంలో వివిధ కాలనీలకు చెందిన ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలనీల వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో రెయిన్, డ్రైన్ వాటర్ విపరీతంగా వచ్చి ముంపునకు గురవుతుండటంతో మీరు పడుతున్న ఇబ్బందులను గుర్తించానని, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని, సంవత్సరకాలంలో పనులు పూర్తి చేసి మీవద్దకు వస్తానని అన్నారు. ఒక ఎమ్మెల్యే సాధారణ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచలేరు. నియోజకవర్గ ప్రజల అండతో నేను అధికార పార్టీలో గెలవడంతో అధిక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం దక్కిందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో వీఆర్ ఆసుపత్రి ఎండీ నందకిషోర్ కాలనీల అధ్యక్షులు సంపత్ కుమార్ రెడ్డి, చెన్న కేశవులు, మాల్యాద్రి, విజయలక్ష్మి, స్థానిక నాయకులు సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ బోధనలు అందించాలి

● తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలి ● కలెక్టర్ హరిచందన దాసరి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతోపాటు డిజిటల్ బోధనలు అందించాలని కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం సికింద్రాబాద్ మారేడుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో గతేడాది కంటే ఈసారి నూరుశాతం సాధించాలని సూచించారు. సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, హెచ్ఎం మోహన్ ఆచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిచందన దాసరి కార్మికులకు సూచించారు. బేగంపేటలోని పాటిగడ్డ ఫంక్షన్‌హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ, దర్పన్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఫ్రంట్ లైన్ కార్మికులు ప్రభుత్వం కల్పించిన ఉచిత వైద్య శిబిరాల ద్వారా వైద్య చికిత్సలు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయశ్రీ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, తహసీల్దార్ పాండునాయక్, వివిధ విభాగాల వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.



కే.సురేందర్ మోహన్‌ను సత్కరిస్తున్న రాగీరు ఆనంద్‌బాబు

వ్యవసాయ మార్కెట్ల అధికారులకు శిక్షణా తరగతులు

సికింద్రాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ డైరెక్టర్ కే.సురేందర్ మోహన్ తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ల అధికారులకు మంగళవారం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని శిక్షణ సంస్థలో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ మొదటగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని అధికారులకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితరులు హాజరయ్యారు. కాగా కే.సురేందర్ మోహన్, లక్ష్మీబాయిలను బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగిరు ఆనంద్‌బాబు సత్కరించారు. మార్కెట్ సెక్రటరీ ఎం.వెంకన్న, గ్రేడ్-2 కార్యదర్శి సత్యనారాయణ, గ్రేడ్-3 కార్యదర్శి మహ్మద్ ఖాజా, కమిటీ సభ్యుడు నల్లోల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం అంటున్న స్కౌట్స్ అండ్ గైడ్స్



పరేడ్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్సై నర్సింగరావు, ఉపాధ్యాయులు, అధికారులు

రాంగోపాల్ పేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ పరేడ్ మైదాన్‌లో జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో కవాతులో పాల్గొనేందుకు మేము సైతంఅంటూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ జిల్లా విద్యార్థులు సిద్ధమవుతున్నారు. సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని జిల్లా కార్యాలయం ఆవరణలో మంగళవారం పరేడ్‌లో పాల్గొనే స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు సిబ్బందితో వచ్చి నిష్ణాతులైన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ చెందర్ మాట్లాడుతూ స్కౌటింగ్, గైడింగ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ అవకాశం రాదని, వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ట్రైనింగ్ కమిషనర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ కవాతు చేసే విద్యార్థి దాదాపు నాలుగు గంటలు ఎండైనా, వానైనా కదలకుండా నిలబడాల్సి ఉంటుందని, విద్యార్థులు అందుకు తగ్గట్టుగా తమను తాము మలుచుకోవాలని సూచించారు. ఈ సెలెక్షన్స్‌లో జిల్లాకు చెందిన ఏడు పాఠశాలల నుంచి 33 మంది స్కౌట్, గైడ్ పాల్గొనగా అందులో 16 మంది సెలెక్ట్ అయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సరస్వతి, రోవర్స్ కమిషనర్ విష్ణుప్రసాద్, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ ఇందుమతి, ఆర్గనైజింగ్ కమిషనర్ సంగీత పాండే, స్కౌట్ మాస్టర్లు సాయి, అశోక్, గైడ్ క్యాప్టెన్లు వెంకట శివలీల, రేష్మ, రూబీలు పాల్గొన్నారు.

గ్రీన్ హెరిటేజ్ పరిరక్షణలో ట్రాఫిక్ శాఖ మరో ముందడుగు



భారీ వృక్షాన్ని తరలించేముందు కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనాన్ని కాపాడడంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేటు వద్ద ఉన్న పెద్ద భారీవృక్షాన్ని అభివృద్ధి పనుల దృష్ట్యా రైల్వే అధికారుల సాయంతో సికింద్రాబాద్ మహబూబ్ కాలేజీ ఆవరణలో పాతిపెడుతున్నట్లు తెలిపారు. ఒక వైపు రైల్వేస్టేషన్ వద్ద నిర్మాణ పనులు, మరో వైపు ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదని ఈ వృక్షాన్ని తరలించాల్సి వచ్చిందన్నారు.



టీచర్స్ కాలనీలో రోడ్లపై ఏరులై పారుతున్న మురుగు

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

మారేడుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి టీచర్స్ కాలనీలో మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ మురుగు రోడ్ల మీదుగా ఏరులై పారుతుంది. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్యపై ఫిర్యాదు చేసినా పరిష్కరించడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనావాసాలకు తగినట్లుగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని, వెంటనే పనులు ప్రారంభమయ్యేలా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట డివిజన్‌లోని 10-4-ఎ/401 ఇంటి సమీపంలో మూడు నెలలుగా డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతోందని జలమండలి అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. ఉదయం, రాత్రి వేళల్లో ఈ మ్యాన్‌హోల్ నుంచి వెలువడుతున్న మురుగునీరు కాలనీలో ప్రవహించడంతో దోమలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల చిన్నపిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు.అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: ఆజాద్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆజాద్ డిమాండ్ చేశారు. ఇప్పటికే సీఎం ఫీజుల పెంపు చేసేది లేదని తేల్చి చెప్పారని, ఈ విషయంలో ఇటీవల కళాశాలల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్ట్ హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక కమిటీ వేసిందని పేర్కొన్నారు. ఈ కమిటీ మంగళవారం జేఎన్‌టీయూలో రివ్యూ సమావేశం నిర్వహించిందని, కొత్త కోర్సులకు, ఫ్యాకల్టీకి జీతాల పెంపు, ల్యాబ్స్ సౌకర్యాలు, ద్రవ్యోల్బణం దృష్టిలో పెట్టుకొని ఫీజులు పెంచాలని కాలేజీల యాజమాన్యాలు కమిటీ ముందు ప్రతిపాదించాయని వివరించారు.



భూలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయంలో మహిళా కాంగ్రెస్ నాయకులు

అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలో జరిగిన బోనాల జాతరలో భాగంగా బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత, కంటోన్మెంట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, కంటోన్మెంటు బోర్డు 8వ వార్డుకు చెందిన మహిళా అధ్యక్షురాళ్లు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ పిలుపు మేరకు మంగళవారం బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. నర్సింహన్ వారికి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.